
ఐ.పోలవరం మండలం కొమరగిరిలో ముంపులో కొబ్బరి తోటలు


కొమరగిరిలో నీట మునిగిన ఆక్వా చెరువులు


బోడసకుర్రులో వరద ఉధృతికి మునిగిన ఇళ్లు

ముంచెత్తిన వరద

- లంక గ్రామాల్లో ఇళ్ల మధ్యకు వరద నీరు
- రేవులలో ప్రయాణాలు నిలుపుదల

ఐ.పోలవరం: గోదావరి వరద ఐ.పోలవరం మండలాన్ని ఇరువైపులా ముంచెత్తింది. గౌతమి, వృద్ధ గౌతమి పాయలు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే తోటలను, రొయ్యల చెరువులను ముంచెత్తిన వరద గురువారం ఉదయం ఇళ్ల మధ్యకు చేరింది. దీంతో ముంపు బాధిత ప్రాంతాల్లో ప్రజలు ఆందోళన చెందారు. సాయంత్రం నుంచి వరద ముంపు తగ్గుతుండడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం వృద్ధ గౌతమీ నదీపాయపై ఉన్న అన్నంపల్లి అక్విడెక్టు గట్టును తాకుతూ వరద ప్రవహిస్తోంది. మరో అడుగు పెరిగి ఉంటే అక్విడెక్టు మీద నుంచి పొంగి పొర్లే పరిస్థితి ఏర్పడేది. వరద పెరగడంతో మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద ఇళ్లలోకి వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరింది. కేశనకుర్రు పల్లగూడెం, పొగాకులంక, జామవానిపేటల్లో వరద నీరు చేరింది. అలాగే కొమరగిరి, పాత ఇంజరం, కేశనకుర్రు, ఎదుర్లంకల వద్ద గోదావరి ఏటిగట్ల దిగువున కొబ్బరి తోటలు ముంపుబారిన పడ్డాయి. కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న అరటి వంటి తోటలు సైతం ముంపులో చిక్కుకున్నాయి. మండలంలోని జి.మూలపాలెం-పల్లంకుర్రు, గుత్తెనదీవి-గోగుల్లంక రేవుల్లో పడవ ప్రయాణాలను రద్దు చేశారు. పశువుల్లంక వంతెన, రాఘవేంద్ర వారధి, ఎదుర్లంక వారధిల వద్ద గోదావరి వరద ఉధృతిని చూసేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.


మురమళ్ల రాఘవేంద్ర వారిధి వద్ద ఇళ్ల వద్దకు చేరుకున్న వరద


బోడసకుర్రు పల్లిపాలెంలో నడుము లోతు వరద నీటిలో నుంచి వస్తున్న మహిళ

సహాయక చర్యలు శూన్యం

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా బోడసకుర్రు జాతీయ రహదారి వద్ద వైనతేయ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద ప్రభావంతో బోడసకుర్రు పల్లిపాలెంలో మత్స్యకారుల ఇళ్లు వరద నీటిలో సగానికి పైగా మునిగాయి. గురువారం ఉదయం నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వరుస వరదలతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడోసారి వరద పోటెత్తడంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. కనీస అవసరాలకు ఇళ్ల నుంచి బయటకు వస్తున్న వరద బాధితులు గుండెల్లోతు నీటిలో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం పడవలను ఏర్పాటుచేయడానికి కూడా అధికారులు చొరవ తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి మత్స్యకార కాలనీ వరద నీటిలో చిక్కుకుంటే బాధితులకు కనీసం భోజనాలైనా ఏర్పాటుచేయలేదు. వృద్ధులు, గర్భిణులను పునరావాస కేంద్రాలకు తరలించలేదు. వరదలు వస్తున్న ప్రతిసారి జీవనోపాధి కోల్పోతున్నామని మత్స్యకార మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం


గొల్లవిల్లిలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: గర్భిణులకు పౌష్టికాహారం చాలా అవసరమని పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వాలని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ సూచించారు. మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి అమ్మన్నఅగ్రహారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంగ కనకదుర్గ, అరిగెల నానాజీ, చీకట్ల ఏసుబాబు, గొలకోటి సత్తిరాజు, మంచెం బాలకృష్ణ, జొన్నాడ చిన్ని, అంగన్‌వాడీ కార్యకర్త దేవరపల్లి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ డ్రైవర్‌తో నడపడం సరికాదు

అమలాపురం రూరల్: అమలాపురం-కొత్తగూడెం అల్ట్రా డీలక్స్ సర్వీస్ సింగిల్ డ్రైవర్‌తో నడపడం సరికాదని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. టికెట్లు ఇవ్వడం, బస్సు నడపడం రెండు పనులు డ్రైవర్ చేయాల్సి రావడంతో విశ్రాంతి లేక అలసట చెంది రిస్క్ ఎక్కువగా ఉంటుందన్నారు. దీనివల్ల సంస్థ, ప్రయాణికులకు, డ్రైవర్లకు నష్టం కలుగుతుందన్నారు. అందుకే డ్రైవర్‌తో పాటు కండక్టర్‌ను నియమించాలని కోరుతూ అమలాపురం డిపో మేనేజర్‌కు ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాత పూర్వకంగా అభ్యర్థించారు.

ముంపు చేలను పరిశీలించిన అధికారులు


గొల్లవిల్లిలో నీటమునిగిన వరి చేలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మధుసూదన్‌రావు

ఉప్పలగుప్తం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటి కారణంగా ముంపునకు గురైన వరి చేలను మండల విపత్తుల ప్రత్యేకాధికారి(సమగ్ర శిక్షా ఏపీడీ) ఎ.మధుసూదన్‌రావు గురువారం పరిశీలించారు. వరి చేలలో ముంపు దిగేలా చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, వ్యవసాయాధికారి జి.కుమార్ బాబు, రీసర్వే డీటీ వైవీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఏ రవిశంకర్, అరిగెల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన అవసరం

ఐ.పోలవరం: సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, లైంగిక దాడులపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థినులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు విస్తరణాధికారి సీహెచ్ నాగలక్ష్మి అన్నారు. కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జూన్ 21 నుంచి అక్టోబర్ 4 వరకూ 100 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచారంలో భాగంగా గురువారం పశువుల్లంక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు జరిగింది. బాలికలు, మహిళల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్లు 100, 112, 181, 1098 ఏ పరిస్థితుల్లో ఉపయోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, మహిళా పోలీసు కె.సోమ చంద్రికలు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం


షటిల్ ఆడుతున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం: పాఠశాల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణ, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక జి.వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలను ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరూ షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో హెచ్ఎం సలాది వెంకట్ నారాయణ, గుత్తుల సాయి, స్థానిక సర్పంచ్ నల్ల సుదర్శన్‌రావు, గుత్తిన దీవి సర్పంచ్ లంకలపల్లి బుల్లియ్య, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆటో కార్మికుల సాయం


వరద బాధితులకు బిస్కెట్లు, బ్రెడ్లు అందిస్తున్న బాలరాజు తదితరులు

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితులకు అమలాపురంలోని ఆటో కార్మికులు సాయమందించారు. పట్టణంలోని ది కోనసీమ ఆటో వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు బొంతు బాలరాజు నేతృత్వంలో సంఘ సభ్యులు విజయవాడ వెళ్లి సుమారు 600 మంది బాధితులకు గురువారం బిస్కెట్లు, బ్రెడ్లు, పండ్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు.

రెడ్డిపల్లిలో క్లీన్ అండ్ గ్రీన్

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వాతి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్.జ్యోతి, రాజులపూడి మహేష్, నల్లా సతీష్, విజయలక్ష్మి, వీఆర్వో గంధం దొరబాబు, వెంకటలక్ష్మీకళ, కృపాపాల్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

17న మద్యం షాపుల మూసివేత

యానాం: నియోజకవర్గంలో మిలాది నబీని పురస్కరించుకుని ఈనెల 17న యానాంలో మద్యం షాపులు మూసివేయాలని డిప్యూటీ కలెక్టర్(ఎక్సైజ్) ఎం.మాథ్యూఫ్రాన్సిస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం షాపులతో పాటు బార్‌లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, హోటళ్లు మూసివేయాలని ఈ మేరకు నాలుగు రీజియన్ల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు పంపామన్నారు.

ఎలుకల మందు పంపిణీ


నల్లమిల్లిలో ఎలుకల నిర్మూలన గురించి వివరిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకుడు షంషి


కోడూరుపాడులో ఎలుకల నివారణ మందును బొరియల వద్ద పెడుతున్న రైతు


ఉప్పలగుప్తంలో ఎలుకల నివారణకు ఎర తయారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఏవో కుమార్‌బాబు

అల్లవరం: సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా కోడూరుపాడులో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశామని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. కోడూరుపాడులోని వ్యవసాయ క్షేత్రాల వద్ద ఎలుకల నివారణకు రైతులు అనుసరించవలసిన పద్ధతులపై అవగాహన కల్పించారు. వరిలో అధిక దిగుబడులు సాధించాలంటే ఎలుకలను నివారించాలన్నారు. ఎకరానికి 4 గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, 4 గ్రాముల నూనె, 192 గ్రాముల నూకలను బాగా కలిపి పొట్లాలుగా కట్టుకుని ఎలుకల బొరియల వద్ద పెట్టాలన్నారు. రైతులందరూ సామూహికంగా చేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల మందు పంపిణీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని అమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏంఏ షంషి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నల్లమిల్లి, జనుపల్లి గ్రామాల్లో సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం గురువారం జరిగింది. నల్లమిల్లి సర్పంచ్ గోకరకొండ శ్రీనివాస్ రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కడలి ధర్మ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు సందీప్, నవీన్, రైతులు వెంకటరమణ, గణాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల వ్యాప్తంగా ఉన్న 14 రైతు సేవా కేంద్రాల్లో రైతులకు గురువారం ఎలుకల నిర్మూలన నిమిత్తం బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. ఉప్పలగుప్తం కేంద్రంలో ఏవో కుమార్‌బాబు ఎలుకల ఎర తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. మునిపల్లిలో సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఎలుకల మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు రవణం మధు, ఆకుల లక్ష్మణరావు, మధుర రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: ఈ నెల 17న జరిగే విశ్వకర్మ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని కార్పెంటర్ల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు జిల్లా దేవాదుల సూర్యనారాయణమూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా సంఘం కార్యాలయంలో దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్ల సంక్షేమ సేవా సంఘం జిల్లా ప్రతినిధి కొనుకు వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన విధంగానే కూటమి ప్రభుత్వం కూడా విశ్వకర్మ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని ఆయన కోరారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఆదేశాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, పితాని బేబీరావు, జల్లి అబ్బులు, దొమ్మేటి రమణ, సాధనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో సామూహిక సీమంతాలు


అమలాపురంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అమలాపురం శాఖ ఆధ్వర్యంలో స్థానిక మెప్మా కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి అధ్యక్షతన పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో మెప్మా జిల్లా హెల్త్ అండ్ న్యూట్రీషన్ స్పెషలిస్ట్ జ్యోతి గర్భిణులు, బాలింతలు ఏఏ సమయంలో ఏఏ పౌష్టికాహారాన్ని తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అమలాపురం ఐసీడీఎస్ సీడీపీవో కేఈఎల్‌డీ కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టే శిశువులు, పెరిగే పిల్లలకు ఎంత మేలు చేకూరుతుందో వివరించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు వెల్ బేబీ షో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు పౌష్టికాహార ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహిళా విభాగం రాష్ట్ర అదనపు కార్యదర్శి యెండూరి రాఘవ, యెండూరి సీతామహాలక్ష్మి, మెప్మా డీపీఎంవీ అధికారి ప్రసాద్, మెప్మా సీవోలు, టీఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్లు అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలంటూ ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్కూల్ శానిటేషన్ కార్మికులు

అమలాపురం రూరల్: ప్రభుత్వం పాఠశాలలో పని చేసే శానిటేషన్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, జిల్లా సీఐటీయు ఉపాధ్యక్షుడు మావూరి భాస్కర్‌రావు, శానిటేషన్ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడిశెట్టి కుసుమ తదితరులు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లు ఆరు నెలలుగా వేతనాలు అందగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాజకీయ నాయకులు తమ సొంతవారిని నియమించేందుకు కొన్నిచోట్ల శానిటేషన్ కార్మికులను తొలగించారన్నారు. చోటా నాయకుల వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ శానిటేషన్ జిల్లా అధ్యక్షురాలు విజయ, దుర్గ, వరలక్ష్మి, మహాలక్ష్మి, గంగాభవాని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


సీతారామపురం ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీ సీతారామపురం ప్రాథమిక పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంపీపీ రాయుడు సునీత భూమి పూజ నిర్వహించారు. మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, కోరంగి గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణం, మరుగుదొడ్ల అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఎంపీపీ సునీత తెలిపారు. కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, స్కూల్ కమిటీ చైర్మన్ పిల్లి త్రిమూర్తులు, ఇంఛార్జ్ హెచ్ఎం కె.ఝాన్సీ లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: మండల పరిధిలోని సీతారామపురం మరిడమ్మ గుడి, స్థానిక స్టేట్‌బ్యాంకు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన అంగాడి హర్షకుమార్ అనే రెండున్నరేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై ఆడుకుంటుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. బాలుడిని తాళ్లరేవు సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు కోరంగి పోలీసులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో నవరాత్ర పూజలు


తాళ్లరేవులో గణపతి హోమాన్ని నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు


సీతారామపురం వరసిద్ధి వినాయక మంటపంలో పూజలు చేస్తున్న భక్తులు


బండారులంకలో స్వామివారి లడ్డూ ఊరేగిస్తున్న భక్తులు

తాళ్లరేవు: వినాయక నవరాత్రుల్లో భాగంగా గురువారం గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సీతారామపురం స్టేట్‌బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక స్వామివారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయ ప్రాంగణంలో గురువారం గణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఈ హోమాన్ని నిర్వహించినట్లు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మర్ల ఫణి శర్మ, చావలి రవి, కొండవీటి శివరామకృష్ణ, కందికొండ బాబి, పెద్దింటి శ్రావణకుమార్ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ పాటలో స్వామివారి లడ్డూను కొండవీటి సత్యసాయి అచ్యుతరామయ్య రూ.18 వేలకు దక్కించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు బిళ్లకుర్తి శ్రీనివారెడ్డి, కొల్లు శ్రీను పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంక బాలగణపతి వీధిలో వేంచేసియున్న శ్రీనివాస బాలగణపతి భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో వినాయక చవితి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, లక్ష్మీ గణపతికి అభిషేకం, నవగ్రహ ఆరాధన, అష్టలక్ష్మి మండపారాధన, అష్టోత్తర పూజ, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం, దుర్గా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూను ఊరేగించారు.

యానాం: యానాంలో కొలువైన శ్రీపిళ్లెయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీగురు దత్తా బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన శేషవాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం నాదస్వరం, అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో గురుదత్త బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని చింతలమెరక గ్రామంలో చిన్నారులు నిర్వహించిన గణపతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గత ఆరు రోజులపాటు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వరసిద్ధి విఘ్నేశ్వరుని లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన చిన్నారులు మట్టపర్తి సూర్య మణికంఠ, ఆరాధ్య, సాహిత్య ఒక లడ్డూని రూ.2550కు సొంతం చేసుకున్నారు. మరో లడ్డూని మట్టపర్తి అవినాష్, సిరివల్లి రూ.2200కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సందీప్, మను, పండు, హరిశ్రీ, గౌతమ్, తన్వి తదితరులు పాల్గొన్నారు.